'స్థానిక' ఎన్నికలపై కన్పించని కదలిక!

మూడు నెలల ముందే జరిపేందుకు పూర్వరంగం సిద్ధం చేయని ఈసీ



గడువుకు మూడు నెలల ముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటన అమలయ్యేలా లేదు.ఇప్పటివరకు ఎలాంటి సమీక్షలు, వీడియో, ఆడియో కాన్ఫరెన్సులను ఎన్నికల సంఘ అధికారులు నిర్వహించకపోవడం, ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ కోసం కసరత్తు ప్రారంభించకపోవడం చూస్తుంటే ఎన్నికలు ముందుగా కాకుండా నిర్ణీత గడువుకే జరిగేలా వున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అందని ఈసీ సంకేతాలు

ఎన్నికల కమిషన్ ప్రకటన మేరకు మూడు నెలలకు ముందే ఎన్నికలు నిర్వహించాలంటే, తదనుగుణంగా ప్రక్రియ చేపట్టాల్సి ఉంది.అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి. అప్పటినుంచి నవంబరు 15లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేసి ప్రచురించాలి. అలాగే ఎన్నికల అధికారుల నియామకం పూర్తి చేయాలి. అప్పటినుంచి నవంబరు 30లోగా పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలి. ఈవీఎంలు సిద్ధం చేయాలి. డిసెంబరు 15లోగా రిజర్వేషన్లు ఖరారు చేయాలి. డిసెంబరు చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి. 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి అదే నెలలో ఫలితాలు కూడా ప్రకటించాలి.వీటికి సంబంధించి ఎన్నికల సంఘం నుంచి జిల్లా అధికారులకు ఎలాంటి సంకేతాలు ఇప్పటిదాకా అందలేదు.

కూటమి నాయకుల్లో సన్నగిల్లిన ఆశలు

వచ్చే ఏడాది ఏప్రిల్‌లో పంచాయతీలకు, మార్చిలో నగర, పురపాలక సంస్థలకు ప్రస్తుత పదవీ కాలాలు ముగియనున్నాయి. మూడు నెలలకు ముందే, అంటే వచ్చే ఏడాది జనవరిలోనే ఎన్నికల్ని నిర్వహించాలని ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని సెప్టెంబరు 3వ తేదీన ఆదేశించారు. దీంతో జిల్లాలోని కూటమి పార్టీల నాయకుల్లో స్థానిక సంస్థల పదవులపై ఆశలు చిగురించాయి. సుమారు 697మందికి సర్పంచులుగా, 6541 మందికి వార్డు సభ్యులుగా, 50 మందికి కార్పొరేటర్లుగా, 111 మందికి కౌన్సిలర్లుగా, ఒకరికి మేయర్‌గా, ఇద్దరికి డిప్యూటీ మేయర్లుగా, నలుగురికి మున్సిపల్ ఛైర్మన్లుగా, ఎనిమిది మందికి వైస్ ఛైర్మన్లుగా పదవులు దక్కుతాయని ఆశ పడ్డారు.ఎందుకంటే 2021వ సంవత్సరంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు అధికారంలో వున్న వైసీపీ కనీవినీ ఎరుగని అక్రమాలకు పాల్పడి 90శాతానికి పైగా పదవులను చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 జడ్పీటీసీ స్థానాలుంటే ఎక్కడా ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవాలయ్యాయంటే ఏ స్థాయిలో ప్రత్యర్థి పార్టీలను వైసీపీ నాయకులు బెదిరించారో అర్థమవుతుంది. పుంగనూరు నియోజకవర్గంలో అయితే ఇతర పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా వైసీపీ నాయకులు అడ్డుకుని దాడులు చేశారు. నామినేషన్ పత్రాలను చించేశారు. చిత్తూరులో పోలీసుల సాయంతో ప్రత్యర్థులను బెదిరించి, కిడ్నాపులు చేసి మరీ నామినేషన్లు విత్‌డ్రా చేయించారు. ప్రశ్నించడానికి చిత్తూరు వస్తున్న అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును తిరుపతి ఎయిర్‌పోర్టులో రోజంతా కూర్చోబెట్టేసి వెనక్కి పంపేశారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తుండిన కుప్పంలో దొంగ ఓట్లతో హల్‌చల్ చేయడంతో పాటు పెద్దఎత్తున డబ్బులు పంపిణీ చేసి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల అర్థాన్నే మార్చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా ఎన్నికలు జరిగితే స్థానిక సంస్థలపై వైసీపీ పెత్తనాన్ని తీసేయొచ్చని కూటమి పార్టీల నాయకులు ఆశపడ్డారు.అయితే ఈసీ ప్రకటనపై యంత్రాంగంలో చడీచప్పుడు లేకపోవడంతో నిర్ణీత గడువుకే ఎన్నికలు జరుగుతాయన్న అంచనాకు వచ్చారు.

కాణిపాకంలో సదుపాయాల కోసం
రూ. 25 కోట్ల టీటీడీ నిధులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాణిపాకంలో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు రూ. 25 కోట్ల టీటీడీ నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ ఏడాది అక్టోబరు 28న జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో కాణిపాకం ఆలయ ప్రాంగణంలో భక్తులు బస చేయడానికి వీలుగా కాంప్లెక్సు నిర్మాణానికి, అలాగే సామూహిక వివాహాల నిర్వహణకు అనువుగా పెద్ద హాళ్ళు నిర్మించేందుకు రూ.25కోట్లు ఆర్థిక సాయం అందించాలని తీర్మానం చేసింది. దీనిపై ఈ నెల 10వ తేదీన టీటీడీ ఈవో ప్రభుత్వ అనుమతి కోరుతూ లేఖ రాశారు. సంబంధిత నిర్మాణాలు దేవదాయ శాఖ టెండర్లు పిలిచి చేపట్టేలా ఆదేశించాలని, నిధులను విడతల వారీగా విడుదల చేయడానికి అనుమతి ఇవ్వాలని ఈవో లేఖలో కోరారు. పరిశీలించిన ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి టీటీడీ ఈవోకు అనుమతి ఇవ్వడంతో పాటు సంబంధిత పనులను టెండర్లు పిలిచి చేపట్టాలని దేవదాయ శాఖను ఆదేశించింది.త్వరలో ఈ నిర్మాణ పనులను చేపడతామని కాణిపాక ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలిపారు.నిధులు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే మురళీమోహన్‌కు, ఆలయ ఛైర్మన్ మణినాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

25 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లావ్యాప్తంగా 25 మండలాల్లో గడిచిన 24 గంటల్లో తేలికపాటి నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా నింద్రలో 74.2, అత్యల్పంగా గుడిపాలలో 1 మిమీ వర్షం కురిసింది. మండలాల వారీగా కార్వేటినగరంలో 55.2,నగరిలో 39.6, వెదురుకుప్పంలో 39.4, పెనుమూరులో 28.2, ఎస్‌ఆర్‌పురంలో 25.2, పూతలపట్టులో 24.2, ఐరాలలో 15.2, బంగారుపాళ్యంలో 12.8, పలమనేరులో 9.2, గంగవరంలో 8.6, గంగాధరనెల్లూరులో 7.4, విజయపురంలో 7.2, చిత్తూరు అర్బన్‌లో 5.6, తవణంపల్లెలో 4.6, సదుం, పుంగనూరు, పెద్దపంజాణి మండలాల్లో 4.2, చౌడేపల్లెలో 3.4, యాదమరిలో 2.6, సోమలలో 2.2, పులిచెర్లలో 2, చిత్తూరు రూరల్‌లో 1.4, రొంపిచెర్లలో 1.2 మిమీ వర్షపాతం నమోదైంది.



రాత్రి.. హంస వాహనంపై వీణాపాణిగా



ఉదయం.. వర్షంతో ఘటాటోపం కింద పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

పడగలు ప్రణమిల్లి.. పద్మావతి శోభిల్లి

● హంస వాహనంపై జ్ఞానప్రదాయిని

తిరుచానూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్ద శేష, హంస వాహన సేవలు జరిగాయి. ఉదయం శంఖు, చక్ర, గదాధారి అయి పరమపద వైకుంఠనాథుడి రూపంలో అమ్మవారు పెద్దశేష వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. గంటకుపైగా చిరుజల్లుల మధ్య.. ఘటాటోపం కింద పెద్దశేషవాహనసేవ సాగింది. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి వీణాపాణిగా హంసవాహనంపై జ్ఞానప్రదాయిని భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల ముందు సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు

● బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం ముత్యపుపందిరి వాహనం
రాత్రి సింహ వాహన సేవ



నేటినుంచి భువనేశ్వరి కుప్పం పర్యటన

4రోజుల పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం సతీమణి

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బుధవారంనుంచి నాలుగురోజుల పాటు కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. నాలుగు మండలాల పరిధిలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొని వారి సాదకబాధకాలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. అలాగే కుప్పం తరలివచ్చిన కృష్ణా జలాలకు జలహారతి ఇస్తారు. మహిళా నాయకురాళ్లతో, ఆర్టీసీ ఉచిత ప్రయాణ లబ్ధిదారులైన మహిళలతో సైతం సమావేశమవుతారు. చివరి రోజు ఆఖరు కార్యక్రమంగా ఎన్టీఆర్ ట్రస్టు కార్యకలాపాల్లో పాల్గొంటారు.

నేటి పర్యటన ఇలా...

ద్రావిడ విశ్వవిద్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు విద్యార్థులతో ముఖాముఖిలో భువనేశ్వరి పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు అలీప్ ప్రాజెక్టు ద్వారా శిక్షణ పొందిన మహిళా పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు.సాయంత్రం 6 గంటలకు గుడుపల్లె మండలం మల్లప్పకొండకు వెళ్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే కార్తీక దీపోత్సవంలో పాల్గొంటారు. రాత్రి శాంతిపురం మండలం కడపల్లె వద్ద గల స్వగృహంలో బస చేస్తారు.

రేపటి పర్యటన వివరాలివీ...

గురువారం ఉదయం 9 గంటలకు స్వగృహంలో ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. 10.30 గంటలకు కుప్పం పురపాలక సంఘ పరిధిలోని దళవాయికొత్తపల్లె చెరువుకు చేరుకుని కృష్ణా జలాలకు హారతి ఇస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపాలిటీ పరిధిలో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీకి భూమిపూజ చేస్తారు. మధ్యాహ్నం 12.45 నుంచి 1.15 గంటలదాకా మున్సిపాలిటీ పరిధిలోని పరసముద్రం కేజీబీవీ స్కూల్‌లో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని మధ్యాహ్నం వారితో కలిసి భోంచేస్తారు.మధ్యాహ్నం 2.30 గంటలకు కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని పూలమార్కెట్టు సమీపంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు.3.45 గంటలకు సామగుట్టపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 'విలువల బడి' కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలనుంచి 5 గంటలదాకా కడపల్లె వద్ద గల స్వగృహంలో మహిళా నాయకురాళ్లతో సమావేశమవుతారు. సాయత్రం 5 గంటలకు డీఎస్సీలో ఎంపికై కొత్తగా ఉద్యోగాలు పొందిన టీచర్లతో ముఖాముఖిలో పాల్గొంటారు.

రైతులకు రెట్టింపు సాయం

నేడు అన్నదాత సుఖీభవ నిధుల జమ

చిత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా సీఎం చంద్రబాబు అన్నదాతకు సుఖీభవ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అందించిన సాయం కంటే రెట్టింపుగా అందిస్తామన్న మాట నిలబెట్టుకుంటున్నారు. ఇదివరకే అన్నదాతకు సుఖీభవ పథకంలో భాగంగా తొలి విడత నిధులు రైతులకు అందగా, బుధవారం రెండో విడత సాయం అందించనున్నారు. ప్రతి రైతు ఖాతాలో రూ.7 వేలు జమ కానున్నాయి.రాష్ట్ర ప్రభుత్వ అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా జిల్లాలోని 2,05,753 మంది రైతులకు రూ.5 వేల చొప్పున రూ.102.88 కోట్లు అందించనున్నారు. అలాగే కేంద్ర పథకం పీఎం కిసాన్‌లో భాగంగా 1,67,900 మందికి రూ.2 వేల చొప్పున రూ.33.58 కోట్ల సాయం అందనుంది.తొలి విడతలో భాగంగా ఇంత మొత్తంలోనే ఆగస్టులో రైతులకు సాయాన్ని అందించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాటా (రైతు భరోసా) కింద రూ.7500.. కేంద్ర వాటా (పీఎం కిసాన్) రూ.6 వేలు, కలిపి రైతులకు మొత్తంగా రూ.13,500 సాయం అందేది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.7500గా ఉన్న రాష్ట్ర వాటాను రూ.14 వేలకు చంద్రబాబు పెంచారు. దీనికి రూ.6 వేలు కేంద్ర వాటా అదనం. ఇప్పటికే రాష్ట్ర వాటా రూ.5 వేలు, కేంద్ర వాటా రూ.2 వేలు కలిపి మొత్తంగా రూ.7 వేలను రైతులకు అందించారు. బుధవారం ఇదే పద్ధతిలో రెండో విడత అందిస్తున్నారు. మూడో విడతలో రాష్ట్ర వాటా రూ.4 వేలు, కేంద్ర వాటా రూ.2 వేలు కలిపి రూ.6 వేలు రైతులకు అందనున్నాయి. అంటే ఏడాదికి ఒక్కో రైతుకు రూ.20 వేల సాయం అందుతోంది.

నియోజకవర్గాల్లో అధికారిక కార్యక్రమాలు

సీఎం చంద్రబాబు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. అన్ని నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొని రైతులకు సాయాన్ని అందించాలని ఆయన ఇప్పటికే సూచించారు. చిత్తూరు జిల్లా విషయానికొస్తే బుధవారం అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి జడ్పీ మీటింగు హాల్లో, పలమనేరుకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో, పూతలపట్టుకు సంబంధించి యాదమరి ఎంపీడీవో కార్యాలయంలో,పుంగనూరుకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో, కుప్పానికి సంబంధించి మార్కెట్ యార్డులో, నగరికి సంబంధించి పుత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో, జీడీనెల్లూరుకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

స్విమ్స్‌లో స్టాఫ్ నర్సుల నియామకానికి నిర్ణయం

తిరుమల,నవంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సమీక్ష జరిగింది. 236మంది స్టాఫ్ నర్సులు, 20మంది పారా మెడికల్ సిబ్బందితో పాటు 48 అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల భర్తీకి గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. డైరెక్ట్ రిక్రూట్మెంట్ పద్ధతిలో ఈ పోస్టులను భర్తీ చేసేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ పాల్గొన్నారు.

టీటీడీ డైరీ, క్యాలెండర్లు ఉచితంగా వద్దు

టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఉచితంగా తీసుకోరాదని బీఆర్. నాయుడు నిర్ణయించుకున్నారు. ఛైర్మన్ హోదాలో ఉన్నవారికి కొన్ని డైరీలు, క్యాలెండర్లను టీటీడీ ఉచితంగా ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అదే పద్ధతిలో ఛైర్మన్‌కు పంపిన 2026 డైరీ, క్యాలెండర్లను బీఆర్ నాయడు తిరస్కరించారు.గత ఏడాదిలాగే తనకు అవసరమైనవాటిని కొనుగోలు చేస్తానని తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సేవలు అనన్యం



పదోన్నతి పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల సేవలు అనన్యమైనవని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలోని 124 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఇటీవల మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా అంగన్వాడీల్లో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లందరికీ పదోన్నతి కల్పించి రూ.7 వేల వేతనాన్ని ప్రభుత్వం రూ.11,500 లకు పెంచింది. ఈ నేపథ్యంలో కడా కార్యాలయంలో మంగళవారం నాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. అంగన్వాడీలకు పదోన్నతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కంచర్ల, పీఎస్ఎంలు మాట్లాడుతూ అంగన్వాడీలు పసిబిడ్డల పాలిట దేవతలన్నారు. వారు ఆలనాపాలనా చూడబట్టే ఇంతింత బిడ్డలు ఎంతెంతో ఎత్తులకు ఎదిగి భవిష్యత్తు విజయాలు సాధించగలుగుతున్నారని ప్రశంసించారు. అంగన్వాడీల వేతనాలను పెంచడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వారి ప్రాముఖ్యతను గుర్తించారన్నారు. అంగన్వాడీ వర్కర్లతో కలిసి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కునత్తం మణికి సన్మానం



మణిని సన్మానిస్తున్న నాయకులు

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన చెక్కునత్తం మణిని మొదలియార్ సంఘం ప్రతినిధులతోపాటు పలువురు మంగళవారం సత్కరించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయనకు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివం, టీడీపీ కుప్పం మండలాధ్యక్షుడు రాజగోపాల్, సంతోష్, హైదర్, విభూషణ్, వెడి, మనోహర్, నాగరాజు, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.


గంగమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం



చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న రవిచంద్రబాబు, సభ్యులు తదితరులు

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం మంగళవారం అట్టహాసంగా జరిగింది. స్థానిక గంగమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేసిన అనంతరం పాలకమండలి అధ్యక్షుడిగా బీఎంకే.రవిచంద్రబాబు, సభ్యులుగా సంతోషమ్మ, ఎన్.వినాయకన్, ఎస్.మహేశ్, కె.శారదమ్మ, ఎస్.రాజ్‌కుమార్, ఎన్.నరేశ్, వెన్నెల, ఎం.మంజుల, వీఏ.లక్ష్మి, ఎన్.జ్యోతీశ్, హెచ్.సోమశేఖర్ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మక పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో మంగళవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కలరింగ్, వర్డ్ సర్చ్, గ్రామర్, మెమొరీ, జంబుల్ వర్డ్ వంటి సృజనాత్మక పోటీలను నిర్వహించారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని ఆర్.పేట, ఎన్టీఆర్ కాలనీ, పాతపేట, తంబిగానిపల్లి కొట్టాలు, వసనాడు, బిరుదనపల్లె, ఉర్దూ, వడ్డిపల్లె, డీకేపల్లె పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథాలయాధికారి సత్యవాణి తెలిపారు.

ఆరిమానిపెంటలో కార్తీక వనసమారాధన



మొక్క నాటుతున్న విద్యార్థులు, అధికారులు

రామకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఆరిమానిపెంట గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అటవీ అధికారులు కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కదిరినరసింహస్వామి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. అటవీ ఉపక్షేత్రాధికారి ధనుంజయుడు అటవీ పరిరక్షణ, వనసంరక్షణ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బీట్ అధికారి పవన్‌కల్యాణ్, స్థానిక నేతలు ప్రకాష్, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

రాతి మసీదు భూములు విక్రయించకండి



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాతిమసీదు కమిటీ సభ్యులు

పుంగనూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాతి మసీదుకు సంబంధించిన భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా నిలుపుదల చేయాలంటూ రాతిమసీదు కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని రిజిస్ట్రార్ సర్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని కొంతమంది ముస్లింలు రాతి మసీదు భూములను వారిపై రికార్డులు సృష్టించుకొని విక్రయాలు చేయడానికి సిద్ధపడ్డారని తెలిపారు. ఈ విషయంపై కమిటీ సభ్యులు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నవధాన్యాల సాగుతో నేల తల్లికి జీవం



కల్లూరులో నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు

కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో నేల తల్లికి జీవం పోస్తే భూమి సారవంతమై అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ వాసు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు సారవంతంగా ఉండేందుకు 21 రకాల విత్తనాల మిశ్రమం గల 10 కేజీల ధాన్యాలను కిట్ల రూపంలో రూ.650 లకు రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. నవధాన్యాల సాగుతో చీడ పీడలను తట్టుకుంటుందన్నారు. నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయని, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. 21 రకాల విత్తనాలను భూమిలో వేసి కలియదున్నడంతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవీన్, పవన్, రమేష్, మునిచంద్ర, సుమిత్ర, రెడ్డివాణి, శ్రీనివాసులురెడ్డి, రామచంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి



గ్రామసభలో మాట్లాడుతున్న రవిరెడ్డి

రామకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి కోరారు. ఈ-పంటపై బందార్లపల్లె-2 గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ వడ్డీలేని పంటరుణాలు, పంటల బీమా సొమ్ము, మద్దతు ధర పొందాలంటే రైతులు తాము పండించిన పంట, సాగు విస్తీర్ణం తదితర వివరాలతో ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మురళీమోహన్, మాజీ సర్పంచి పెరుమాళ్, నేతలు రంగారెడ్డి, రమేష్‌రెడ్డి, గిరి, మోహన్‌బాబు, మధు తదితరులు పాల్గొన్నారు.

నివేశ స్థలాల పంపిణీకి అర్హులను గుర్తించండి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల పట్టాల పంపిణీకి అర్హులైన లబ్ధిదారుల జాబితాను వెంటనే సిద్ధం చేయాలని పలమనేరు ఎమ్మెల్యే సభ్యులు ఎన్.అమరనాథరెడ్డి సూచించారు. మంగళవారం పలమనేరులోని ఆయన కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో పలు అంశాపై ఆయన సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి టౌన్‌హాల్, డ్రైనేజీ, చెరువు అభివృద్ధి పనులు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అలాగే ఇప్పటి వరకు పేదల నుంచి ఇళ్లస్థలాల కోసం అందించిన అర్జీలను పారదర్శకంగా పరిశీలించి నిజమైన అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. త్వరలో పేదలకు పట్టాల పంపిణీ చేసేలా అధికారులు పనులు పూర్తిచేయాలన్నారు. సమీక్షలో తహసీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, డీఈ సురేష్, ఏఈ స్నేహప్రియ, టీపీఎస్ ఇందిర, సర్వేయర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

పుంగనూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) గ్రంథాలయ ఉపయోగాలపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి తులసీనాయక్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక లినార్డు మున్సిపల్ పాఠశాల, ఉజ్జయిని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సదుం విద్యార్థి



యోగేశ్వర్

సదుం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అండర్-17 కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు తమ పాఠశాలకు చెందిన యోగేశ్వర్ అనే విద్యార్థి ఎంపికైనట్లు సదుం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. చౌడేపల్లె మండలం పుదిపట్ల ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి యోగేశ్వర్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. యోగేశ్వర్‌ను వ్యాయామ ఉపాధ్యాయులు శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



సదుం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో రాధారాణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులకు పచ్చదనం, పరిసరాల శుభ్రత నిర్వహణపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, పీఆర్ డీఈ రాజశేఖర్, కార్యదర్శులు, పలువురు సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఓదార్యం

●రూ.6.25 లక్షలతో ప్రార్థనా మందిరం నిర్మాణం పూర్తి



నిర్మించిన ప్రార్థనా మందిరం

కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రూ.6.25 లక్షలతో పాఠశాల ఆవరణలో ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. ఈ ప్రార్థనా మందిరం పాఠశాలకు తలమానికంగా నిలిచింది. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త వారణాశి సౌమినిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం లక్ష్మీదేవి, ఎస్ఎంసీ చైర్ పర్సన్ అక్బర్ తెలిపారు. విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో 1964-65 సంవత్సరం ఎస్ఎస్ఎల్‌సీ పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. పాఠశాల విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా రూ.6.25 లక్షలతో ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. చదువుకున్న పాఠశాలకు తమవంతు సాయంగా పాఠశాల ఆవరణలో నిర్మించినట్లు పూర్వ విద్యార్థులు రెడ్డెప్పనాయుడు, కేటీజీ పిళ్లై, రామనాథం, రమాదేవి, చంద్రారెడ్డి తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో సదరన్ క్యాంప్



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యుడు

పలమనేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఏరియా ఆస్పత్రిలో మంగళవారం సదరన్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో దివ్యాంగులకు సదరన్ క్యాంపు డాక్టర్ పరీక్షలు నిర్వహించారు. 30 మందికి క్యాంపులో డాక్టర్ పరీక్షలు చేసి వారి వికలత్వ స్థాయిని గుర్తించి నమోదు చేశారు. సదరన్ క్యాంపులో డాక్టర్ నిర్ధారణ మేరకు ప్రభుత్వం నుంచి వీరు సామాజిక పెన్షన్ తీసుకునేందుకు అర్హత పొందుతారని తెలిపారు.

అండర్-17 జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



జిల్లా కబడ్డీ జట్లకు ఎంపికైన విద్యార్థులు

చౌడేపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అండర్-17 బాల బాలికల జిల్లా కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చారాల హైస్కూల్‌లో ఇటీవల జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి వారిలో జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు కర్నూల్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ రాజేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణ సేవలు మరువలేనివి



వెంకటరమణను సన్మానిస్తున్న అధికారులు

చౌడేపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా వెంకటరమణ సేవలు మరువలేనివని ఏపీఎంలు సుబ్రహ్మణ్యం, కుమార్‌స్వామి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా వెంకటరమణ రైతులకు విరివిగా రుణాలు, వ్యవసాయ పరికరాలు, రాయితీ టార్పాలిన్ పట్టలు తదితర వస్తువులు అందించి రైతుల అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను శాలువాలతో సత్కరించారు. నూతన అధ్యక్షుడిగా సింగిల్ విండో ఛైర్మన్ పగడాల హరిప్రసాద్‌ను రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



వనాల్లో కార్తీక దీపాల వెలుగులు

రామకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రికి భక్తులు ఆలయం వద్దకు చేరుకుని ఆలయం వద్ద, వెనుక త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహ ప్రతిష్ఠకు పలువురు దాతలు విరాళం అందజేసినట్లు కమిటీ అధ్యక్ష, కోశాధికారులు మునివెంకటప్ప, జ్యోతీశ్వరుడు తెలిపారు. ఇరికిపెంట పంచాయతీ రాశెట్టివారిపల్లె విశ్రాంత అధ్యాపకులు రాశెట్టి దొరస్వామి రూ.50 వేలు, కలికిరి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై. సోమశేఖర్ రూ. 30 వేలు, లాయర్ సత్యబాబు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో కామిశెట్టి నగేశ్, వైఎస్. మునిరత్నం, శ్రీరాములు, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి....

సోమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కరకమంద సమీపంలోని పురాతన పోలేరమ్మ ఆలయంను పునరుద్ధరణకు పలువురు దాతలు విరాళం అందజేస్తున్న ట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎస్. నడింపల్లె సర్పంచి కర్రి వెంకటరమణ రూ.50,116, కరకమంద పసలప్పగారి ప్రవీణ మోహన్ రూ.25, 116, సుగుణ బాలయ్య రూ. రూ.10, 116, రమేశ్ రూ.10,116, హనుమంతరావు, విజయకుమారి రూ. 10,116, ఆర్. కళావాసు రూ.10,116, గుంటి రెడ్డెమ్మ, సీతారామయ్య రూ.10,116, బట్టే కృష్ణవేణి శివరాం రూ. 5 వేలు విరాళాలు అందజేసినట్లు తెలిపారు.

తులసినాథం నాయుడికి ఆహ్వానం



పలమనేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ తెలుగు మహాసభలకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి. తులసినాథం నాయుడికి ఆహ్వానం అందింది. 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో గుంటూరులోని నందమూరి తారకరామారావు వేదికపై జరుగనున్న ఈ మహాసభలకు హాజరు కావాలని కోరుతూ ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆహ్వాన పత్రిక పంపారు. తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధి, సాంస్కృతిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న తులసినాథం నాయుడికి ఆహ్వానం అందడంపై తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శ గ్రామ సంఘాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎం చంద్రమోహన్

కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ గ్రామ సంఘాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా శిక్షణ తరగతులు కొనసాగాలని ఏపీఎం చంద్రమోహన్ తెలిపారు. పులిచెర్ల స్త్రీ శక్తి భవనంలో మండలంలోని డ్వాక్రా సమాఖ్య సభ్యులకు మంగళవారం మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలన్నారు. వార్షిక ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. సీసీలు తేజోవతి, వెంకట్రమణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నేడు సర్పంచులకు శిక్షణ తరగతులు

కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10 గంటలకు సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. శిక్షణలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

వికలాంగుల గుర్తింపు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

రొంపిచెర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వృద్ధుల కోసం నిర్వహిస్తున్న సహాయక పరికరాల గుర్తింపు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇర్షాద్ కోరారు. పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండల వాసులకు ఈనెల 23వ తేదీన సదుం హైస్కూల్‌లో శిబిరం ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఉర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు 4, రెండు మొబైల్ నెంబర్లతో హాజరు కావాలని కోరారు.

మిద్దెపై నుంచి పడి మేస్త్రి మృతి

పుంగనూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి పుంగనూరులో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని చింతలవీధికి చెందిన వెంకటరాజు కుమారుడు నాగరాజు (60) మేస్త్రీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి భోజనం తర్వాత మిద్దెపైకి వెళ్లి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షాల అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టరు విశ్వనాథనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఉదయ్‌కుమార్ కోరారు. మంగళవారం అనికెరె, రేగడదిన్నేపల్లె, కెనమాకులపల్లెల్లో పార్టీ పంచాయతీ కమిటీల సమావేశాల్లో వారు మాట్లాడారు. సమావేశాల్లో నేతలు నాగరాజు, రాజేంద్ర, ఆర్.నాగరాజు, మణి, లోకేశ్, జయ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయండి

రామకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో బుధవారం నుంచి జరిగే సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్‌టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకటరమణ, కామరాజ నాయక్ కోరారు. శుక్రవారం మధ్యాహ్నం 1.45 గంటలకు విజలాపురం చెరువులో జలహారతి, మధ్యాహ్నం 3 గంటలకు బల్ల, సాయంత్రం 4.15 గంటలకు ఆనిగానూరులో మహిళల సమావేశంలో, సాయంత్రం 5.30 గంటలకు పార్టీ మహిళా నేతల సమావేశంలో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమాల్లో మండల పరిధిలోని నేతలు, కార్యకర్తలు, మహిళలు, యువత తప్పక హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి నివాళులు



గంగవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంగవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా మంగళవారం ఆమె చిత్రపటానికి ఏబీవీపీ నాయకులు సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్‌ల ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఉమామహేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగరంలో కొండచిలువ

రామకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గాంధీనగరం గ్రామ సమీప పొలాల్లో భారీ కొండచిలువ కనిపించింది. ఓ రైతు పొలం పక్కన ఉన్న కొండ చిలువను రైతులు చాకచక్యంగా పట్టుకుని సమీప అడవిలో వదిలేశారు.

వరసిద్ధుడి సేవలో ఎంపీ అజిత్



ఎంపీకి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు అజిత్ మాధవరావు గోపచడే కుటుంబ సమేతంగా మంగళవారం కాణిపాక వరసిద్ధుడ్ని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఒంటరి ఏనుగు విధ్వంసం



ఏనుగు దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లు

కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని కల్లూరు, పాళెం పంచాయతీలో సోమవారం రాత్రి పొలాల్లో ఒంటరి ఏనుగు దాడులు చేయడంతో పంటలకు నష్టం వాటిల్లింది. పశ్చిమ విభాగం అడవిలో గోగులమ్మ వంక ప్రాంతం నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు ఘాట్ రోడ్డు సమీపంలోని రిలయన్స్ టవర్ వద్దకు చేరుకుంది. కల్లూరు, పాళెం పంచాయతీ కోటపల్లి, జూపల్లి గ్రామాల్లోని పలురురు రైతులకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి సమీపంలోని తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోకి చేరుకుంది. మంగళవారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

రామకుప్పంలో జంట ఏనుగుల దాడులు



నన్నియాలలో ఏనుగులు తొక్కేసిన వరి పంట

రామకుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో అటవీ సమీప పొలాలపై జంట ఏనుగుల దాడులు కొనసాగుతోంది. సోమవారం రాత్రి ననియాల, ననియాల తండా సమీప పొలాల్లో సంచరిస్తూ హల్‌చల్ చేశాయి. వరి, రాగి పంటలను తిన్నంతగా తిని ధ్వంసం చేశాయి. గ్రామస్తులు వాటిని అడవిలోకి తరిమే ప్రయత్నాలు చేయగా తిరగబడ్డాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు ట్రాకర్లతో కలిసి కాగడాలు చేతబట్టి టపాకాయలు పేల్చుతూ వాటిని అడవిలోకి తరిమేశారు. ఎస్.గొల్లపల్లె గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. బీట్ అధికారులు సుబ్రహ్మణ్యం, నిరంజన్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గంట్లప్పగౌడు పాల్గొన్నారు.



ఎస్.గొల్లపల్లెలో గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్న అటవీ అధికారులు

రూ.66.49 లక్షల విలువైన కూరగాయల వితరణ



వి.కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయానికి వి.కోట సత్యసాయి సేవా సమితి కన్వీనర్ చంద్రశేఖర్ రూ.66.49 లక్షల విలువైన కూరగాయలను ఉచితంగా అందజేశారు. ప్రశాంతి నిలయం బాల వికాస్ సమన్వయకర్త శంకర్‌కు మంగళవారం కూరగాయలను అందజేశారు.

సిద్ధేశ్వరాలయ అభివృద్ధికి రూ. 1.9 కోట్ల అదనపు సాయం

ఎర్రావారిపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెం మండలంలోని తలకోన సిద్ధేశ్వరాలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం టీటీడీ రూ. 1.90 కోట్ల మేరకు అదనపు సాయం అందించడానికి రాష్ట్రప్రభుత్వం అంగీకరించింది. తలకోన సిద్ధేశ్వరాలయ పునరుద్ధరణకు రూ. 18 కోట్లు ఆర్థిక సాయం చేసేందుకు వీలుగా పాలకమండలి చేసిన తీర్మానం మేరకు గత జూలైలోనే ప్రభుత్వం నిధుల విడుదలకు అనుమతి ఇచ్చింది. అందులో మొదటి విడత కింద రూ. 2 కోట్లతో పనులకు ఇ-టెండర్లు కూడా పిలిచారు. అయితే స్థంభవర్గం నుంచీ విమానం దాకా ఆలయంలో బ్యాలెన్సు పనులు పూర్తి చేయడానికి అదనంగా రూ. 1.90 కోట్లు కేటాయించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ టీటీడీ ఈవో ప్రభుత్వానికి ఈనెల 11న లేఖ రాశారు. స్పందించిన ప్రభుత్వం అదనపు సాయం చేసేందుకు అనుమతి ఇచ్చింది.

గ్రేటర్‌లో మేము కలవలేం

- తిరుపతి రూరల్‌లో 32 పంచాయతీల విముఖత
- సాయినగర్, న్యూమంగళం అనుకూలం

తిరుపతి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతిలో కలిసేందుకు రూరల్ మండలంలోని ప్రజాప్రతినిధులు విముఖత చూపారు. గ్రేటర్‌లో విలీనానికి 34 పంచాయతీల పాలకమండళ్ల అభిప్రాయ తీర్మానాలను పంపాలని కోరుతూ ఈనెల4న డీపీవో పేరిట నోటీసులు జారీ అయ్యాయి. పదిరోజుల్లోపు తీర్మానాలను సమర్పించాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో 32 పంచాయతీల పాలకమండళ్లు గ్రేటర్‌లో కలవలేమంటూ తీర్మానించారు. సాయినగర్, న్యూమంగళం(శెట్టిపల్లె) పంచాయతీలు మాత్రం అనుకూలంగా తీర్మానం చేశాయి. తమకు స్థానికంగా రాజకీయ భవిష్యత్ ఉండదన్న భయంతో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు విలీనాన్ని తిరస్కరిస్తున్నారని తెలుస్తోంది. పాలక మండళ్ల తీర్మానాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో దయాసాగర్ తెలిపారు.

దివ్యాంగులకు చేయూత

- నేటినుంచి పరికరాల గుర్తింపు శిబిరాలు



వెదురుకుప్పం/చిత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల కోసం బుధవారం నుంచి ఈ నెల 26వ తేది వరకు జిల్లాలో నిర్ణయించిన ప్రదేశాలలో గుర్తింపు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఇన్‌చార్జి విక్రమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వద్ద, 20వ తేదీ కార్వేటినగరం జడ్పీ హైస్కూల్, 21న ఐరాల జడ్పీ హైస్కూల్, 22న నగరి వీసీఎన్ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో గుర్తింపు శిబిరాలు జరుగుతాయన్నారు. 23న సదుం జడ్పీ హైస్కూల్‌లో, 24న వీకోట జడ్పీ హైస్కూల్‌లో, 25న గుడుపల్లె జడ్పీ హైస్కూల్‌లో, 26న శాంతిపురం జడ్పీ హైస్కూల్‌లో గుర్తింపు శిబిరాలు ఉంటాయన్నారు. ఈ శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు నాలుగు వికలత్వ ఫొటోలు, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలన్నారు.

అర్హతలు ఇవీ..

లబ్ధిదారులు దారిద్ర్యరేఖకు దిగువ (బీపీఎల్) కుటుంబాలకు చెందిన వారై సహాయక పరికరాలు అవసరమైన వారు అర్హులు. అవసరాన్ని బట్టి ఒకటి కంటే ఎక్కువ ఉపకరణాలకు ఎంపిక చేయనున్నారు. .యూడీఐడీ కార్డు లేదా రశీదు,ఆధార్‌కార్డు. వైద్య ధ్రువీకరణ సర్టిఫికెట్, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, 4 పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, రెండు మొబైల్ ఫోన్ల నంబర్లు సమర్పించాల్సి ఉంటుంది. 60 సంవత్సరాలలోపు ఉన్న వారికి డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరి. ఆ వయసు పైబడినవారికి సర్టిఫికెట్ అవసరం లేదు.

సహాయ పరికరాలు

వాకింగ్ స్టిక్స్, వాకర్లు, 3/4లెగ్ స్టిక్స్, కచ్చులు, వీల్‌చైర్లు, హియరింగ్ ఎయిడ్స్, బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్స్, రోలేటర్లు, ఎంఎస్ కిట్స్, అంధులకు టాకింగ్ వాచ్‌లు, వైట్‌కేన్లు, టచ్‌ఫోన్లు, వాయిస్ ఫోన్లు, ఎల్బో కచ్చులు, కృష్ఠు రోగుల కిట్స్, డైసీ ప్లేయర్లు, ఎంఐడీ కిట్స్, స్మార్ట్‌కేన్, కృత్రిమ అవయవాలు తదితర పరికరాలు అందజేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

మాదకద్రవ్యాల కట్టడికి ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్



ఎస్పీతో కలిసి సమీక్షను నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌బారిన పడకుండా యువతకు కాపాడుకుందామని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ తుషార్ డూడీతో కలిసి నార్కోటిక్స్‌పై ఆయన సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలు, ఇతర విద్యా సంస్థల్లో, క్యాంపస్‌లను మాదకద్రవ్యాల నుంచి విముక్తి పొందేలా చూడాలన్నారు. ఇక్కడ నిఘా పెంచాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు సంబంధించిన సంఘటలను వెంటనే నివేదించాలన్నారు. గంజాయి సాగు జరగకుండా ఎక్సైజ్, అటవీశాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. తమిళనాడు, పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాకు డ్రగ్స్ రవాణా కట్టడికి చెన్నై, బెంగళూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను తనిఖీలు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణకు రానున్న 4నెలల్లో జిల్లా యంత్రాంగం, పోలీసుశాఖ సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళతాయన్నారు. అంతకుముందు జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఆర్డీవోలు, డీఎస్పీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలకు వైసీపీ వక్రీకరణ: టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వైసీపీ నేతలు వక్రీకరిస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ విమర్శించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన పారిశ్రామిక వేత్తలను భయపెట్టి తరిమేశారన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు దేశాలు తిరిగి ప్రముఖ కంపెనీలతో మాట్లాడి ఒప్పిస్తుండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులనుద్దేశించి సీఎం చేసిన వాఖ్యలను వైసీపీ నేతలు వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమి చేశాయో చెబుతూ... ప్రజాధనం కాపాడటానికి కార్మికులు కూడా బాధ్యతగా పనిచేయాలని మాత్రమే సూచించారన్నారు. ఈ మాటలను కూడా వైసీపీ ఫేక్ నాయకులు, ఫేక్ మీడియా వక్రీకరించి ఫేక్ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో నేతలు మోహన్‌రాజ్, కుమార్, యువరాజులు నాయుడు, ధరణి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'సైనికులకు' కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోరాదు

తిరుపతివాసి కేసులో హైకోర్టు ఆదేశం


అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల్లో సేవలందిస్తున్న సైనికులకు మాజీ సైనికోద్యోగుల కోటా కింద భూమిని కేటాయించడం చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టత ఇచ్చింది. కేవలం మాజీ సైనికులకు మాత్రమే భూమిని కేటాయించాలనే చట్టనిబంధన ఏదీ లేదని తేల్చి చెప్పింది. సర్వీసులో ఉన్న సైనికులు, మాజీ సైనికోద్యోగులు కూడా భూకేటాయింపు కోసం జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని భూపరిపాలన ప్రధాన కమిషనర్ 2022లో సర్క్యులర్ జారీ చేశారని గుర్తు చేసింది. సర్వీసులో ఉన్న సమయంలో భూకేటాయింపు చేశారనే కారణంతో భూములను వెనక్కి తీసుకోవడానికి వీల్లేదని తెలిపింది. సాయుధ దళాల్లో సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు, దేశ సరిహద్దులను, ప్రజలను కాపాడుతున్నందుకు కృతజ్ఞతగా మాజీ సైనికులకు భూకేటాయింపు విధానాన్ని తీసుకొచ్చారంది. నిబంధనలు అడ్డుపెట్టుకొని మంచి ఉద్దేశాన్ని దెబ్బతీయడానికి వీల్లేదని తెలిపింది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద పిటిషనర్‌కు కేటాయించిన 4.35 ఎకరాల తక అడవి భూమిని అడవి పోరంబోకుగా పేర్కొంటూ రిజిస్ట్రేషన్ నిషేధిత భూముల జాబితా(22ఏ) నుండి తొలగించడానికి తిరుపతి జిల్లా కలెక్టర్ నిరాకరించడాన్ని తప్పుపట్టింది. తక అడవి, అడవి పోరంబోకు పదాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కలెక్టర్ యాంత్రికంగా ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొంది. తహశీల్దార్ ఇచ్చిన నివేదికలో భూమి అడవి పోరంబోకు అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ లేనప్పటికీ పిటిషనర్ భూమిని అడవి పోరంబోకుగా నిర్ధారిస్తూ కలెక్టర్ ఎలా ఉత్తర్వులు ఇచ్చారో అర్థం కావడం లేదంది. మూడునెలల్లో భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఆ లోపు నిషేధిత జాబితా నుండి భూములు తొలగించకుంటే భూముల బదిలీ/విక్రయ నిమిత్తం దస్త్రాలను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉంచవచ్చని పిటిషనర్‌కు తెలిపింది. వాటిని పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ సుభేందు సమంతో ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

తన భూమిపై హక్కు కోసం హైకోర్టుకు మాజీ సైనికోద్యోగి

ఏర్పేడు మండలం, పాగాలి గ్రామ పరిధిలో తిరుపతికి చెందిన చెంచయ్య నాయుడికి మాజీ సైనికోద్యోగుల కోటాలో 4.35 ఎకరాలను 2009లో అధికారులు కేటాయించారు. పదేళ్ల తరువాత 2019లో భూమిని విక్రయించేందుకు ప్రయత్నించగా నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని అధికారులు చెప్పారు. ఆ జాబితా నుండి భూములను తొలగించాలని కలెక్టర్‌ను కోరగా... భూమిని అడవి పోరంబోకుగా పేర్కొంటూ నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు నిరాకరించారు. అధికారుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ చెంచయ్య నాయుడు 2019లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి... కలెక్టర్ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే భూపరిపాలన ప్రధాన కమిషనర్ వద్ద అప్పీల్ చేసుకోవాలని 2024లో వ్యాజ్యాన్ని పరిష్కరించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ చెంచయ్యనాయుడు 2025లో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. సైనికోద్యోగి తరపున న్యాయవాది ఎంఆర్‌కె చక్రవర్తి వాదనలు వినిపిస్తూ.... మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూమిని పదేళ్ల తరువాత విక్రయించుకునేందుకు వెసులుబాటు ఉందన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వం జీవోలు ఇచ్చిందన్నారు. ఏర్పేడు తహశీల్దార్ సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన వివరాల ప్రకారం ఆ భూమిని తక అడవిగా వర్గీకరించారన్నారు. కలెక్టర్ మాత్రం అడవి పోరంబోకుగా పేర్కొంటూ నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు నిరాకరించారన్నారు. సీసీఎల్ఏ సర్క్యులర్ ప్రకారం సర్వీసులో ఉన్న సైనికులు సైతం భూముల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం పై ఆదేశాలిచ్చింది.

మహా నగరికి ఆమోదం

- 63 పంచాయతీలతో కలిపి గ్రేటర్ తిరుపతి
- మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం



తిరుపతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సవరించిన తిరుపతి గ్రేటర్ తీర్మానానికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. మంగళవారం మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం ఎస్వీయూ సెనేట్ హాలులో జరిగింది. గత నెల 24న జరిగిన కౌన్సిల్ సమావేశంలో 53 గ్రామ పంచాయతీలతో పాటు 10 రెవెన్యూ గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేసిన ప్రతిపాదన చర్చకు ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. అయితే నగరానికి అతిచేరువలో మిగిలిపోయినవి, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభీష్టం మేరకు భౌగోళిక స్వరూపం, పట్టణ లక్షణాలను పరిగణలోకి తీసుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ లేఖ మేరకు రెవెన్యూ గ్రామాలను తొలగించి అదనంగా 10 గ్రామ పంచాయతీలు విలీనం చేసేందుకు ఆమోదం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. గత సమావేశంలో గొడవ నేపథ్యంలో ఈసారి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సమావేశంలోనూ రాద్ధాంతం చేయాలని వైసీపీ భావించింది. పది లక్షల జనాభాతో గ్రేటర్ ఏర్పాటు చేయాలంటూ ఆ పార్టీ కార్పొరేటర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. తమకు 12 లక్షల జనాభాతో పెట్టినా అభ్యంతరం లేదంటూ డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, సభ్యులు ఎస్కే బాబు, నరసింహాచారి, నరేంద్రనాథ్ తదితరులు చెప్పడంతో వారి నోట మాట రాలేదు.

మరింత విస్తరణ అవసరం

తిరుపతి కేంద్రంగా నలువైపులా కల్యాణిడ్యాం, రాయలచెరువు, అంజేరమ్మ కనం, ఏర్పేడు ఐఐటీ, ఐజర్ వరకు విస్తరిస్తే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుందని మేయర్ శిరీష అభిప్రాయపడ్డారు. గ్రేటర్ పరిధిలోకి తిరుమలనూ తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి సూచించారు.

కొత్తగా చేరిన పంచాయతీలు

తిరుపతి రూరల్ మండలంలోని బ్రాహ్మణపట్టు, కుంట్రపాకం, గాంధీపురం, పెరుమాళ్లపల్లి, పుదిపట్ల.. చంద్రగిరి మండలంలోని రాయలపురం, బుచ్చినాయుడుపల్లె, పిచ్చినాయుడుపల్లె.. రేణిగుంట మండలంలోని అత్తూరు.. ఆర్సీపురం మండలంలోని సి.రామాపురం గ్రామ పంచాయతీలను చేర్చనున్నారు.

ప్రస్తుతం

మున్సిపల్ పరిధి: **30.17 కి.మీ**
నగర జనాభా: **4.52 లక్షలు**
ఆదాయం : **రూ.149 కోట్లు**

విలీనం తర్వాత

వచ్చే ఆదాయం : **రూ.43కోట్లు**
మొత్తం ఆదాయం: **రూ.192 కోట్లు**
63 గ్రామాల జనాభా : **3.4 లక్షలు**
మొత్తం జనాభా :**7.86 లక్షలు**

నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి

- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పార్టీ శ్రేణులకు, నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన భువనేశ్వరి పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు. భువనేశ్వరి ఈనెల 19, 20, 21, 22 తేదీలలో కుప్పం నియోజకవర్గంలోని కుప్పం మున్సిపాలిటీతోపాటు కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తారని చెప్పారు. నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో కుప్పంలో చేపట్టిన అనేక కార్యక్రమాలను వివరించారు. చదువుకున్న యువతకు డీఎస్సీ కోచింగ్ ఇవ్వడంతో అనేకమంది టీచర్లుగా ఉద్యోగాలు పొందారన్నారు. ఇంకా ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత క్లినిక్‌లు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి కుప్పం వచ్చి నేరుగా నియోజకవర్గ ప్రజలను కలుసుకుని వారి సమస్యలు పరిష్కరిస్తానని భువనేశ్వరి హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకే ఆమె ప్రస్తుత పర్యటన చేస్తున్నారని తెలిపారు. ఈ పర్యటనలో ముఖ్యంగా మహిళలతో ముఖాముఖి సమావేశమవుతారని, కృష్ణా జలాలకు జలహారతి ఇస్తారన్నారు. గత పర్యటనలో మాదిరిగానే నారా భువనేశ్వరిని ఆదరించి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కడా పీఈసీ సభ్యుడు రాజ్‌కుమార్, చెక్కునత్తం మణి, వెంకటేశ్, ప్రశాంత్, మణి, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ



చిన్నారికి వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర ప్రముఖులు

చిత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా వికలాంగులకు ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్ వంటివాటిని అందిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం జ్యోతిరావు పూలే బీసీ భవన్‌లో వికలాంగులకు వినికిడి యంత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఏఎస్ఎఫ్‌సీ చైర్మన్ రేగుల రామాంజులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పింఛన్లు తీసుకుంటున్న వారిలో 95 శాతం చెవిటివారేనన్నారు. వారందరికి కృత్రిమ వినికిడి యంత్రాలను ఉచితంగా అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. అంగవైకల్యం కలిగిన వారు శిబిరాలకు వెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. దీనదయాల్ శ్రావణ ఫౌండేషన్, నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఇప్పటివరకు 20వేల మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశామన్నారు. అనంతరం కలెక్టర్, ఫౌండేషన్ సభ్యులు కలిసి పిల్లలకు వినికిడి యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు సీఆర్ రాజన్, టీడీపీ నేత చెన్నకేశవులు నాయుడు, బీజేపీ నేత లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు మాజీ ఎమ్మెల్యేకు ముందస్తు బెయిల్

పలమనేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడతో పాటు మరో 10 మందిపై నమోదయిన మూడు కేసులకు సంబంధించి మంగళవారం పోలీసులు 41ఏ నోటీసులను అందజేశారు. గత నెల 21వ తేదీన పలమనేరులో ఓ ఇంటి నిర్మాణాన్ని అక్రమమంటూ కూల్చేందుకు మాజీ ఎమ్మెల్యేతో పాటు 11 మంది ప్రయత్నించారని, అడ్డువెళ్లిన ఎస్ఐ విధులకు ఆటంకం కలిగించారని నమోదైన కేసులపై హైకోర్టు వీరికి ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు న్యాయవాది హరికృష్ణారెడ్డి తెలిపారు. కోర్టు సూచనలతో వారు మంగళవారం పోలీసు స్టేషన్‌కు వచ్చి 41ఏ నోటీసులు అందుకున్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ


కాణిపాకపట్నం సచివాలయంలో హాజరుపట్టికను పరిశీలిస్తున్న మురళీ మోహన్

తవణంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె, కాణిపాకపట్నం సచివాలయాలను ఎమ్మెల్యే మురళీమోహన్ మంగళవారం తనిఖీ చేశారు. కాణిపాకపట్నం సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. హాజరు పట్టికలో సిబ్బంది సంతకం చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మత్యంలో అభయాంజనేయస్వామిని ఆయన దర్శించుకొన్నారు. అర్చకులు ఆయనకు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, అరగొండ సింగిల్ విండో చైర్మన్ రంజిత్‌రెడ్డి, కాణిపాక ఆలయ చైర్మన్ మణినాయుడు, హరిబాబు నాయుడు,గాలి దిలీప్‌ప్రవీణ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై సర్పంచులకు శిక్షణ


మాట్లాడుతున్న హరిప్రసాద్‌రెడ్డి

తవణంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిరక్షణ కోసం గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యచరణపై స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్సీ కో-ఆర్డినేట ర్ హరిప్రసాద్‌రెడ్డి సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, ఉప సర్పంచ్‌లకు దిశా నిర్దేశం చేశారు. పంచాయతీల పరిధిలో చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఏవో రెడ్డిబాబు, సర్పంచ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణ

చిత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ చిత్తూరు కోసం ఘన వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని సహాయ కమిషనర్ ప్రసాద్ సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నగరపాలక కార్యాలయంలో వార్డు ఎమినిటీ, సంక్షేమం, శానిటేషన్- ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శులకు మంగళవారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణలో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఎంహెచ్‌వో లోకేష్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ శ్రీనివాస్‌లు మాట్లాడారు. ఎంఈ వెంకట్రామిరెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడికి సన్మానం


మురళీమోహన్‌ను సన్మానిస్తున్న దేవరాజులునాయుడు

వెదురుకుప్పం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పి.మోహన్‌మురళిని మంగళవారం పార్టీ నేతలు సత్కరించారు. కొత్తగా పార్టీ పదవిలో నియమితులైన నేపథ్యంలో ఈ ఆత్మీయ సన్మానం చేశారు. సన్మానించిన వారిలో ఏఎంసీ వైస్ చైర్మన్‌దేవరాజులునాయుడు, నాయకులు మొగిలయ్య, వెంకటరమణారెడ్డి ఉన్నారు.

పారిశుధ్య చర్యలు నిర్వహించండి


పారిశుద్ధ్యంపై సూచనలిస్తున్న ఎంపీడీవో

విజయపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య చర్యలు నిర్వహించాలని ఎంపీడీవో రాజేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పారిశుధ్య నిర్వహణపై సూచనలిచ్చారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సగం రోగాలు తగ్గుతాయన్నారు. వీధుల్లో మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా బుధవారం కోసలనగరంలో ఉదయం కలెక్టరు, ఎమ్మెల్యే భానుప్రకాష్ పర్యటించనున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. పారిశ్రామిక వాడ ఏర్పాటులో భాగంగా ఏపీఐసీసీ అధికారులు, సంబధిత రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

చిత్తూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా.. సీపీఎఫ్ ఫ్యాక్టరీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రామదాసు(22) పనిచేస్తున్నాడు. ఆదివారం నుంచి అదృశ్యమయ్యాడు. ఈక్రమంలో మంగళవారం ఫ్యాక్టరీ సమీపాన ఓ చెరువులో శవమై తేలాడు. బీఎన్‌ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దివ్యాంగుల శిబిరం


కార్వేటినగరంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సహాయ పరికరాల ఎంపిక కోసం బుధవారం పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. సహాయ పరికాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెదురుకుప్పం: దివ్యాంగులు, వృద్ధుల సహాయ పరికరాల పంపిణీకి ఈ నెల 20న కార్వేటినగరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక శిబిరం జరుగుతుంది. శిబిర ప్రాంతాన్ని మంగళవారం డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పరిశీలించారు. ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ నాగరాజు, ఉద్యోగులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించి తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో చంద్రమౌళిలే కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశమయ్యారు. దివ్యాంగులు, వృద్ధులకు శారీరక అవసరాలను గుర్తించడం, అవసరమైన సహాయక, వసతి పరికరాలను ఎంపిక చేయడం లాంటివి జరుగుతాయని తెలిపారు. వెదురుకుప్పం, పాలసముద్రం, కార్వేటినగరం, ఎస్‌ఆర్‌పురం, జీడీనెల్లూరు మండలాల వారు హాజరుకావాలన్నారు.

21న దివ్యాంగులకు పరికరాల పంపిణీ

ఐరాల(కాణిపాకం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 21న దివ్యాంగులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన దివ్యాంగులు సమీపంలోని సచివాలయంలో కార్యదర్శి వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అవసరమైన పరికారాల వివరాలు తెలియజేయాలన్నారు. సదరన్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

7,357 మందికి అన్నదాత సుఖీభవ లబ్ధి

వెదురుకుప్పం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ద్వారా మండలంలో 7,357 మందికి లబ్ధి చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి వనిత తెలిపారు. వీరి ఖాతాల్లో రూ.4.79 కోట్లు జమ అవుతుందన్నారు. రెండవ విడతలో ఈ సొమ్మును బుధవారం జమ చేస్తారన్నారు. బుధవారం రైతులు వారి వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాల వద్దకు వచ్చి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. సొమ్ము జమ కాకపోతే సంబంధిత రైతు సేవా కేంద్రంలో ఉద్యోగిని సంప్రదించాలని సూచించారు.

వ్యాసరచన పోటీల్లో లాస్య ప్రతిభ



చిత్తూరు సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన పోటీల్లో లాస్యకు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి వచ్చిందని సత్యసాయి సేవాసంస్థ జిల్లా అధ్యక్షుడు మధుసూదనం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో చిత్తూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి, రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి గెలుచుకుందన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నగరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఎస్‌జీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపులో బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి గురుమూర్తి తెలిపారు. ఉపాధ్యాయులు ఈశ్వరి, సంపత్, సుధ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

చిత్తూరు రూరల్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కరించేందుకు బుధవారం పైపల్లి సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌తో చిత్తూరు టౌన్, బంగారుపాళ్యం, రెడ్డిగుంట, పైపల్లె చెందిన విద్యుత్ వినియోగదారులు హాజరవచ్చన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుందన్నారు.

సీపీఐ నిరసన

చిత్తూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనుల, ముస్లిం మైనార్టీలపై దాడులను అరికట్టాలని సీపీఐ నాయకులు శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, గోపీనాథ్, మణి, రఘు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

చిత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అదృశ్యమయ్యాడని ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మహేశ్వర వివరాల మేరకు.. మిట్టూరుకు చెందిన పాతికేళ్ల ధనసాయి పూతలపట్టు సమీపంలోని సోలార్ కంపెనీలో పనిచేస్తునాడు. ఈ నెల 6న వెళ్లిన అతడు ఇప్పటివరకూ తిరిగిరాలేదు. దీంతో మంగళవారం యువకుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దివ్యాంగులు పేర్లు నమోదు చేసుకోండి

గుడిపాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ రకాల దివ్యాంగులు ఉచిత పరికరాల కోసం చిత్తూరు పీవీకేఎన్ కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో శిరీష సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు తమ ఆధార్ కార్డు,సదరన్ సర్టిఫికేట్‌తో పాటు రెండు ఫొటోలు సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

సమస్యలతో షికారీల సహవాసం

●కాలనీలో కొరవడిన ప్రాథమిక వసతులు ● పట్టాలు లేని భూములతో అందని పథకాల లబ్ధి


షికారీకాలనీలో ఉరుస్తున్న ఇళ్లు - లైట్లు బిగించని విద్యుత్ స్తంభం - అధ్వానంగా తయారైన రోడ్డు

వెదురుకుప్పం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీలోని షికారీ కాలనీవాసులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. తమ మొర ఎవరూ ఆలకించడంలేదని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సుమారు నలభై కుటుంబాల వారుంటున్నారు. వీరికి ఇరవై ఏళ్ల క్రితం ఎకరం నుంచి రెండెకరాల వరకు భూములు ఇచ్చారు. కానీ నేటికీ అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. పట్టాదారు పాసుపుస్తకాలు లేవు. భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో వీరు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద లబ్ధి పొందలేకపోతున్నారు. దీనిపై పలుసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని షికారీలు వాపోతున్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం గృహాలు మంజూరయ్యాయి. అసంపూర్తిగా నిర్మించడంతో వర్షం వస్తే ఉరుస్తున్నాయి.

అవస్థల నడుమ కాపురాలు

కాలనీలో వీధి దీపాలు లేవు. చీకటి పడితే ఇబ్బందులు పడుతున్నారు. అటవీప్రాంతం కావడంతో విషపురుగుల బెడదతో బాధపడుతున్నామని వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి పైపులు సరిగా లేక తిప్పలు తప్పడం లేదు. డ్రైనేజీలు లేక మురుగు ముందుకుపోయే దారిలేదు. తమ భూములకు హద్దులు చూపి, పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఇక్కడి ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

వానొస్తే ఇల్లు ఉరుస్తోంది



వానొస్తే ఇల్లు ఉరుస్తోంది. మురుగునీటి కాలువలు లేవు. కనీసం మా కాలనీలో చెత్త చెదారాలను ఎవరూ తొలగించడంలేదు. ఇళ్లమధ్య పిచ్చిమొక్కలు పెరిగాయి. వీధి లైట్లులేక రాత్రుళ్ల ఇబ్బంది పడుతున్నాం. తాగునీటి పైపులైన్లకు రబ్బరువి కావడం వల్ల అవి పగిలిపోతున్నాయి. కలుషిత నీరు వస్తోంది. -సెల్వి, షికారీ కాలనీ

భూములిచ్చినా పట్టాలేవీ?



భూములిచ్చినా పాసు పుస్తకాలు ఇవ్వలేదు. భూములు ఎక్కడున్నాయో చూపలేదు. దీంతో మాకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ డబ్బులు పడటం లేదు. కాలనీలో మాకు కనీస సౌకర్యాలు కూడా లేవు. ముఖ్యంగా భూముల విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకుని పరిష్కరించాలని కోరుతున్నాను.-నాగేంద్ర, షికారీ కాలనీ

ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు ప్రాధాన్యం


ఆర్వీ ఇండస్ట్రీస్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

పూతలపట్టు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. పూతలపట్టు సమీపాన ఆర్.వి. ఇండస్ట్రీస్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లకు ప్రాధాన్యతనిచ్చిందికూటమి ప్రభుత్వమేనన్నారు.ప్రాంతీయ సమతుల్యతను పెంపొందించి జాతీయ అసమానతలను తొలగించేందుకు చిన్నతరహా పరిశ్రమలు దోహదపడతాయన్నారు. అంతకుమునుపు ఇండస్ట్రియల్ ఆవరణలో పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి పలు మిషన్లను పరిశీలించారు. ఆర్.వి. ఇండస్ట్రీస్ అధినేత ముత్తును యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు, ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ పూర్ణ, బాలకృష్ణారెడ్డి, శరవణకుమార్, సునీల్ చౌదరి, ఇందిరమ్మ, సుబ్బరాజులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం విశిష్టమైనది


కవులను సన్మానిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

చిత్తూరు సిటీ, నవంబరు 18 :ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యం విశిష్టమైనదని రచయిత డా.హరినాయుడు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాయుడు మాట్లాడుతూ సాహిత్య పఠనానికి ఆదరణ తగ్గుతోందన్నారు న్యాయవాది నాగిరెడ్డి తన ప్రసంగంలోసాహిత్యంలో విలువల గురించి తెలియజేశారు. విశ్రాంత ఆచార్యులు దండాల రాధాక్రిష్ణరెడ్డి తెలుగు సాహిత్యంలో పద్య సాహిత్య ప్రాధాన్యం గురించి వివరించారు. కథా రచయిత చంద్రశేఖర్,. అధ్యాపకులు శరత్‌చంద్ర శేఖర్‌లు మాట్లాడారు. అనంతరం కవులు, రచయితలను గ్రంథాలయ సిబ్బంది శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో రచయితలు మునస్వామి, ఆనందనాయుడు, డిప్యూటీ లైబ్రేరియన్ ఎం.గజేంద్ర బాబు, సిబ్బంది శ్రీనివాసాచారి, మునీంద్ర, పూర్ణిమ, పాల్గొన్నారు.

వ్యవస్థలను గాడిలో పెట్టిన కూటమి ప్రభుత్వం


స్వామిదాస్, కోదండరెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

గంగాధరనెల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన వ్యవస్థలను కూటమిప్రభుత్వం గాడిలోపెట్టిందని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్‌లు అన్నారు. గంగాధరనెల్లూరు మండలానికి కొత్త టీడీపీ అధ్యక్షుడుగా స్వామిదాస్, ప్రధానకార్యదర్శిగా కామసాని కోదండరెడ్డిలు ఎన్నికైన నేపథ్యంలో మంగళవారం వారిని టీడీపీనేతలతో పాటు కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్‌లు సన్మానించారు. సమావేశంలో నియాజ్‌అలీ, నరసింహులునాయుడు, ఎసుబ్రమణ్యం, ఇమ్మాన్‌వేల్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన డీపీవో


వైద్యులతో మాట్లాడుతున్న డీపీవో రామ్మోహన్

పాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో రామ్మోహన్ అన్నారు. మంగవారం బొమ్మసముద్రం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. రక్త పరీక్ష కేంద్రాన్ని, మరుగుదొడ్లను, బెడ్లు ఎలా ఉన్న విషయంపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎం,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో సహకార వారోత్సవం

గంగాధరనెల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను విరివిగా మంజూరు చేస్తూ రైతుల ఆర్థికాభివృద్ధికి సింగిల్‌విండో ద్వారా చేయూతనిస్తున్నట్లు మండల సింగిల్‌విండో చైర్మన్ ముప్పిరి మోహన్‌నాయుడు అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా గంగాధరనెల్లూరు సింగిల్‌విండో ఆవరణలో మంగళవారం ఆయన సహకారజెండాను ఎగురవేశారు. సింగిల్‌విండో త్రీమెన్ కమిటీ డైరెక్టర్లు జ్యోతియాదవ్, ఇమ్మానువేల్, సహకార అధికారి సుధాకర్, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ గోమతి, సీఈవో విజయకుమారెడ్డి పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవో కార్యవర్గం


ప్రభాకర్‌వర్మ- వెంకటేశులు- సతీష్

నిండ్ర, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నగరి తాలుకా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం ఆరూరులో ఎన్నిక జరిగింది. తాలుకా అధ్యక్షుడిగా డి.ప్రభాకర్‌వర్మ, సహాధ్యక్షుడిగా ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా సురేంద్రకుమార్, విజయకుమార్, తులసి జలందర్, కార్యదర్శిగా ఎస్.వెంకటేశులు, సంయుక్త కార్యదర్శులుగా సతీష్, రఘు, ధనవేలు, కోశాధికారి భానుచందర్, ఉపాధ్యక్షురాలిగా దివ్య, సంయుక్త కార్యదర్శిగా సునీతలతో పాటు సభ్యులను ఎన్నికైనట్లు తెలిపారు.

తెలుగు యువత అధ్యక్షుడికి శుభాకాంక్షలు


కేక్‌కట్ చేస్తున్న వెంకటేశులు, టీడీపీ నాయకులు

నగరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిట్టి(వెంకటేశులు) జన్మదిన వేడుకలను మంగళవారం పార్టీ నాయకులు,కార్యకర్తలు నిర్వహించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. దేశమ్మ ఆలయంలో పూజలు. శిరీడ్స్ వికలాంగుల పాఠశాలలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు కృష్ణారెడ్డి, రమేష్‌బాబు, అల్లిముత్తు, వరదరాజులు, వెంకీ, జయచంద్రనాయుడు, అల్బర్ట్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల ప్రధాన కార్యదర్శిగా వెంకటాచలం



శ్రీరంగరాజపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పుల్లూరు గ్రామానికి చెందిన వెంకటాచాలం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి రావాడానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్, నాయకుడు గంధమనేని జయశంకర్ నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు

దేశమ్మతల్లికి వెండి కిరీటం బహూకరణ


వెండి కిరీటం అందిస్తున్న పాఠశాల సిబ్బంది

నగరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టీఆర్ కండ్రిగలోని నేత్ర ప్రధాని దేశమ్మతల్లికి 1,268 గ్రాముల వెండి కిరీటాన్ని మంగళవారం భక్తులు విరాళంగా అందించారు. నాగలాపురం రోడ్డులోని అక్షర ఇంగ్లిష్ మీడియం పాఠశాల సిబ్బంది ఈ కిరీటాన్ని అందించినట్టు ఆలయ చైర్మన్ కె.ఆర్.మణి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నిలకంఠం, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో జలమయమైన కార్యాలయాలు

నగరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జాతీయ రహదారి పనుల్లో గోతులు తీసిన ప్రాంతాలన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. రోడ్లు బురదమయంగా మారాయి. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని వివిధ కార్యాలయాల చుట్టూ వర్షపునీరు చేరింది. ఎమ్మార్సీ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాంతాలు బురదగుంటలా మారింది. మార్గం లేకపోవడంతో నీరు నిలిచిపోయింది.

మండల అభివృద్ధికి సహకరించండి


ఎంపీడీవోతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయలని మండల టీడీపీ అధ్యక్షుడు తాళ్యారు శివనాయుడు వివిధ శాఖల అధికారులను కోరారు. ఆయన మంగళవారం తొలుత ఎంపీడీవో సతీష్‌ను కలిశారు. అనంతరం తహసీల్దార్ గురప్పను కలిసి ప్రజలకు రెవెన్యూ శాఖ పరంగా సమస్యలు లేకుండా చూడాలని కోరారు. సీఎంకండ్రిగలో నిర్వహించిన 104 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎస్ఐ రాజశేఖర్‌ను మర్యాద పూరకంగా కలిశారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి సాంబశివన్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ అరుళ్‌నాథన్, శేఖర్‌రాజు,నవీన్ చౌదరి, గోపి, సాయిరాజు, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామదేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, హరిద్రవం,పసుపు,కుంకుమలతో అభిషేకించార భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.